క్లుప్తంగా

తాళ్ల గోకవరం సచివాలయ సర్వేయర్‌కి అవార్డు



నరసింహంను అవార్డుతో సత్కరిస్తున్న ఎంపీపీ, ఇతర అధికారులు

పెదవేగి: పెదవేగి మండలంలో జగనన్న భూహక్కు–భూ సర్వేలో ఉత్తమ సేవలందించిన పెదవేగి మండలం తాళ్ల గోకవరం సచివాలయం సర్వేయర్ పూతి నరసింహం ప్రశంసాపత్రం పొందారు. పెదవేగి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించిన 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా మండల పరిషత్ అధ్యక్షురాలు తాతా రమ్య పూతి నరసింహంను దుశ్శాలువాతో సత్కరించి, ప్రశంసాపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ జి. మనోజ్‌కుమార్, మండల సర్వేయర్ మూర్తి పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

భీమడోలు: రాష్ట్ర, జాతీయ రహదారుల్లో ప్రయాణించే వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ అన్నారు. జాతీయ రహదారి పూళ్ల వద్ద మంగళవారం ద్విచక్ర వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై ఆయన కౌన్సలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని 30 మందికి జరిమానాలు విధించారు.

నేడు జల్లి కొమ్మరలో గడపగడపకు..

గణపవరం: ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం (193వ రోజు) బుధవారం సాయంత్రం 4.30 గంటలకు జల్లి కొమ్మర గ్రామంలో నిర్వహిస్తున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ దండు రాము తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు హాజరై ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తారన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని కొమ్మర గ్రామ సర్పంచ్ కురెళ్ల వెంకట రత్నం కోరారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యే పోతునూరు రాక

దెందులూరు: దెందులూరు మండలం పోతునూరు గ్రామానికి బుధవారం ఉదయం 10 గంటలకు ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి విచ్చేస్తున్నారని ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, సర్పంచ్ బోదుల స్వరూప్ తెలిపారు. పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ఎంపీ, ఎమ్మెల్యేలు విచ్చేస్తున్నారని మంగళవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ, సర్పంచ్ కోరారు.

మద్యం విక్రేత అరెస్ట్

ఏలూరు టౌన్: సీఐ ఎస్.రాజశేఖర్ ఆదేశాల మేరకు ఏలూరు మండలం కొత్తూరు జూట్‌మిల్లు సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజు అనే వ్యక్తి ఒక షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసి, 24 క్వార్టర్ బాటిల్స్, రూ.10వేలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. ఏలూరు మండలం చాటపర్రు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనుక వైపు కొందరు వ్యక్తులు పేకాడుడుతుండగా పోలీసులు దాడి చేశారు. ముగ్గురుపై కేసు నమోదు చేసి, వారి నుంచి రూ.4600 స్వాధీనం చేసుకున్నారు.

బాలికకు అంతుచిక్కని వ్యాధి

ద్వారకాతిరుమల: ఆడుతూ.. పాడుతూ సరదాగా గడపాల్సిన ఆ బాలిక రెండేళ్లుగా అంతుచిక్కని వ్యాధితో బాధపడుతోంది. ఆరు నెలలుగా కదలలేని దుస్థితిలో మంచం పట్టింది. వ్యాధి ఏమిటో నిర్ధారణకాక, ఏం చేయాలో తెలియక ఆ బాలిక తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. బోరున విలపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. కూలి పనులు చేసుకొని జీవిస్తోన్న ద్వారకాతిరుమల మండలం సత్తాల పంచాయతీ సంద్రకుంటకు చెందిన కొత్తపల్లి గంగయ్య, సత్యవతి దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు సంతానం. కుమార్తె మనస్విని (15) రెండేళ్లుగా అంతుచిక్కని వ్యాధితో బాధపడుతోంది. ఇప్పటికే చెన్నై, కోయంబత్తూర్, హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రిలోని ఆస్పత్రుల్లో మనస్విని చూపించినా వ్యాధి నిర్ధారణ కాలేదు. తమ బిడ్డను కాపాడుకునేందుకు దాతలు సహకరించాలని. సెల్ నంబర్ 96669 28734లో సంప్రదించాలని ఆమె తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఆకివీడు మండలం కుప్పనపూడి గ్రామానికి చెందిన మోటుపల్లి రాజు బుధవారం రూ.1,11,011 విరాళంగా అందజేశారు. కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

త్యాగధనుల పోరాట ఫలమే స్వాతంత్య్రం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- వాడవాడలా వైభవంగా స్వాతంత్ర్య దినోత్సవం
- రెపరెపలాడిన మువ్వన్నెల జాతీయ పతాకం



పెదపాడు: వట్లూరు గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



నిడమర్రు: బువ్వనపల్లిలో విద్యార్థినులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న ఎంపీ శ్రీధర్, ఎమ్మెల్యే వాసుబాబు

పెదపాడు: స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా మండలంలో గ్రామగ్రామాన అంబరాన్నంటేలా సంబరాలు నిర్వహించారు. వాడవాడలా మువ్వన్నెల జాతీయ పతాకం రెపరెపలాడింది. స్వేచ్ఛాయుత భారతవని కోసం అశువులు బాసిన ఎందరో త్యాగధనుల సేవలను స్మరించూ దేశ ఖ్యాతిని చాటేలా సంబరాలు అంబరాన్నంటాయి. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు త్యాగధనుల పోరాట ఫలమేనని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. మండలంలోని అప్పనవీడు జేఎంజే ఇంగ్లీషు మీడియం పాఠశాల, వట్లూరు గురుకుల పాఠశాలలో నిర్వహించిన 77వ స్వాతంత్ర్య దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన జాతీయ జెండాను ఎగురవేసి వందన సమర్పణ చేసారు. దేశానికి సాతంత్ర్యం సముపార్జన చేసిన దేశ నాయకులు చిత్రపటాలకు పూలమాలలు వేశారు. జేఎంజే పాఠశాలలో ఉత్తమ ఫలితాలు అందించిన విద్యార్థులకు యాజమాన్యం ఏర్పాటు చేసిన నగదు బహుమతులు పంపిణీ చేసారు. వట్లూరులో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేక్ కట్ అందరికీ పంపిణీ చేసారు. ప్రిన్సిపాల్ మేరీ ఝాన్సీ, జేఎంజే పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వేడుకలు

పెదపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి, ఎంఈఓలు సబ్బితి నర్సింహమూర్తి, దేవినేని రమణ పాల్గొన్నారు. పెదపాడులో సొసైటీ, గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద, ఆటో స్టాండ్ వద్ద, నాయుడుగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద, పెదపాడు, నాయుడుగూడెం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లోను రాజుపేట గ్రామ పంచాయతీ వద్ద స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, సర్పంచ్ కొత్తూరు జీవన కుమారి పాల్గొన్నారు. అప్పనవీడులో గ్రామ పంచాయతీ కార్యాలయ వద్ద సర్పంచ్ చిన్నాల ఝాన్సీ జాతీయ జెండా ఆవిష్కరించారు. మండల కన్వీనర్ అప్పనప్రసాద్ ఎంటీసీ బుద్దే రామసీత, వైస్ ఎంపీపీ పద్మావతి పాల్గొన్నారు. వట్లూరులో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గుజ్జుల రత్నకుమారి జాతీయ జెండాను ఎగురు వేసారు. తోటగూడెంలో సర్పంచ్ ఏనుగ అబ్రహం జాతీయ జెండాను ఆవిష్కరించారు. కలపర్రులో వస్త్రపు విష్ణుతులసి కోటిరెడ్డి, కొక్కిరపాడులో మరీదు రెడ్డియ్య, ఏపూరులో చోడగిరి రామకృష్ణ, రాజుపేటలో తొందురు క్రాంతి కుమార్, నాయుడుగూడెంలో సిద్దాబత్తిన జోజమ్మ, కొత్తూరులో కడిమి పద్మావతి గోవిందరావు, పాత ముప్పర్రులో మెడబలిమి స్వరూపరాణి సంతోష్ కుమార్, కొత్తముప్పర్రులో కోటలలితకుమారి గోవర్ధన్, తాళ్లగూడెంలో ఇళ్లూరి జోజి ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద జెండా వందన సమర్పణ చేసారు. పెదపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ విజయ్‌కుమార్, పెదపాడు పోలీసు స్టేషన్ వద్ద ఎస్సై కృష్ణ చల్లా జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ఉద్యోగస్తులకు ప్రశంసాపత్రాలు అందజేత

పెదవేగి : పెదవేగి మండలంలోని స్వాతంత్ర దినోత్సవ వేడుకులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పెదవేగి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగస్తులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. గ్రామంలోని పాఠశాల్లో నిర్వహిస్తున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే ఇతర నాయకులు పాల్గొన్నారు. పెదవేగి స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల వద్ద, భోగాపురంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దుగ్గిరాలలోని సెయింట్ జోసఫ్ దంత వైద్యశాలలో కరస్పాండెంట్ జి మోజెస్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వికార్ జనరల్ ఫాదర్ పి బాల విచ్చేశారు. రాయన్నపాలెం ఉన్నత పాఠశాల్లో సర్పంచ్ పర్వతనేని రమాదేవి, ఎంపీటీసీ మట్టా రాగిణి జాతీయ పతాక ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.



ఉంగుటూరు: జాతీయజెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి



ఉంగుటూరు: కళాశాలలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్



పెదవేగి : భోగాపురం వద్ద రెపరెపలాడుతున్న భారీ జాతీయ పతాకం

స్వాతంత్ర్య ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలి

దెందులూరు: స్వాతంత్ర్య దినోత్సవ ఫలాలను ప్రతి ఒక్కరూ పొందేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజా సహకారం అవసరమని దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ సందర్శించిన పోతునూరు గ్రంథాలయంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని గ్రంథాలయాధికారి రాంబాబు అధ్యక్షతన ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, సర్పంచ్ బోదుల స్వరూప్, సొసైటీ చైర్మన్ డీఎస్‌వీ ప్రసాద్ (బజ్జీ) ప్రారంభించారు. మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు తలారి రామకృష్ణ, బుద్దా అర్జున, లింగాల రవి, బత్రాజు సత్యనారాయణ, రామ్మోహనరావు ఉన్నారు. దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, తొత్తడి వేదకుమారి, ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి, ఏపీఎం వేణుగోపాల్, ఎంపీటీసీ గొరిపర్తి వరలక్ష్మి పాల్గొన్నారు. కార్యాలయంలో తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శిని, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు. గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యాకళాశాలలో ప్రిన్సిపల్ నత్తానియేలు, మౌలానా అబుల్ కలాం విద్యా సంస్థల్లో కరస్పాండెంట్ మహ్మద్ వలీవుల్లా ఆధ్వర్యంలో , ఎంఈఓ ఎవీఎస్‌వీ ప్రసాద్, పోలీస్ స్టేషన్‌లో దెందులూరు ఎస్సై ఐ.వీర్రాజు, దెందులూరు సీహెచ్‌సీలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరీరాజు జాతీయ పతాకాలు ఎగురవేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షులు పోకల రాంబాబు, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, తొత్తడి కృష్ణ, వన్నెకూటిసుందరం, రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

భారీపతాక స్థూపం వద్ద ఘనంగా వేడుకలు

పెదవేగి : భోగాపురం మెయిన్ బైపాస్ వద్ద భారీ జాతీయ పతాకాన్ని ఏలూరు ఆటో యూనియన్ అధ్యక్షుడు ఆగుల రాజు ఆవిష్కరించారు. పీఆర్వో పులి శ్రీరాములు, సంస్థ కరస్పాండెంట్ కట్నేని లక్ష్మీకృష్ణ ప్రసాద్, కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

ఎందరో మహాత్ముల త్యాగఫలం

నిడమర్రు: ఎందరో మహాత్ముల త్యాగ ఫలం నేటి స్వాతంత్ర్యం అని ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని బువ్వనపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ఎమ్మెల్యే వాసుబాబుతో కలిసి పాల్గొన్నారు. ముందుగా జెండా ఎగుర వేసి, జాతీయ నాయకుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మట్లాడుతూ మహాత్మాగాంధీ ఆలోచనలకు అనుగుణంగా మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ సుపరిపాలన అందిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ధనుకొండ మహాలక్ష్మి, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వెజ్జు వెంకటేశ్వరరావు, యువజన విభాగం సహాయక కార్యదర్శి సంకు నాగేషు, మండల సచివాలయాల కన్వీనర్ నౌడు అచ్యుతరామారావు తదితరులు పాల్గొన్నారు.

మువ్వెన్నల జెండా వద్ద సందడి



భీమడోలు: హ్యూమన్‌రైట్స్ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న రాష్ట్ర చైర్మన్ డి.శ్రీనివాసులు

భీమడోలు: స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా ఆజాదీకా అమృత మహోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం దుద్దేపూడి పంచాయతీ పరిధిలోని అన్నేవారిగూడెంలో భారీ జాతీయ జెండా వద్ద చిన్నారులు, పెద్దలు సెల్ఫీలు దిగారు. హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్ ఆధ్వర్యంలో భారీ జెండాను గ్రామంలోని ర్యాలీ, ప్రదర్శన చేసారు. డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి రాజీలు, సర్పంచ్ నీలం శ్రీనివాసరావు, ఎంపీటీసీ పాల్నాటి శ్రీనివాస్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

త్యాగధనుల ప్రాణత్యాగమే ఫలమే స్వాతంత్ర్యం

స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. భీమడోలు శాఖా గ్రంథాలయం, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సర్పంచ్ పాము సునీతా మాన్‌సింగ్, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగలు, భీమడోలు ఎంపీపీ కార్యాలయం వద్ద ఎంపీపీ కనమాల రామయ్య, భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో సీఐ వి.వెంకటేశ్వరరావు, భీమడోలు అమ్మవార్ల ఆలయాల వద్ద మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు, గుండుగొలను పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాలల్లోను, లైబ్రరీల్లో సర్పంచ్ కూర్మా లక్ష్మీరాజ్‌కుమార్, ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. పూళ్ల ప్రభుత్వ పాఠశాలలు, పీహెచ్‌సీ, గ్రంథాలయంలో పూళ్ల సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి రాజీ జాతీయ జెండాను ఎగురవేసారు. భీమడోలు గాంధీ బొమ్మ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యర్రంశెట్టి ఏడుకొండలు ఆధ్వర్యంలో, డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యలో భీమడోలు సత్యేంద్ర పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో సీఐ వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. భీమడోలు పోలీస్ స్టేషన్‌లో సీఐ వి.వెంకటేశ్వరరావు జాతీయజెండాను ఎగురవేశారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆసుపత్రుల్లోని రోగులకు పండ్లు, రొట్టెలు, పాలును ఉచితంగా పంపిణీ చేసారు. గుండుగొలను మావులేటి మధుసూధనరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఇరిగేషన్ జాయింట్ కార్యదర్శి మామిళ్లపల్లి కాళీకుమార్ జెండాను ఎగుర వేసారు. 500 మంది చిన్నారులకు నోటు పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలను పంచారు. భీమడోలులోని హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయం వద్ద చైర్మన్ డి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో జెండాను ఎగుర వేసారు.



దెందులూరు: పోతునూరు గ్రంథాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం



భీమడోలు: గుండుగొలనులో చిన్నారులకు అభ్యసనా సామగ్రిని అందిస్తున్న ఎం.కాళీకుమార్

విద్యార్థులకు నగదు బహుమతుల పంపిణీ

ఉంగుటూరు: నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ జాతీయ జెండాను ఎగుర వేశారు. అధ్యాపకులు రామ చంద్రరావు, పి. వెంకటేశ్వరరావు, దుర్గయ్య, హేమ, ఎరుక నాయుడు, రమేష్, శ్రీకాంత్, రాంబాబు, కార్యాలయం సిబ్బంది ప్రసాదులు పాల్గొన్నారు. ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో కె.హేమలత నిట్‌లో సీటు లభించినందుకు ప్రిన్సిపాల్ అభినందించారు. ఆమెను రూ.2 వేలు నగదు బహుమతిని అధ్యాపకులు జి.రమేష్ అందజేశారు.

త్యాగధనుల స్ఫూర్తి మరువరాదు

ఉంగుటూరు: త్యాగధనుల స్ఫూర్తి మరువరాదని ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం ఉంగుటూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎంపీపీ ఎగుర వేశారు. ఎంపీటీసీలు, ఎంపీడీవో ఆంజనేయలు, ఎంపీటీసీ ఛాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజు, సచివాల యాల మండల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ పాల్గొన్నారు. తహసీల్దారు కార్యాలయం వద్ద జాతీయ జెండాను తహసీల్దారు వెంకటరమణ ఎగుర వేశారు. వీఆర్వోలు, డీటీ బి.ప్రసాదు పాల్గొన్నారు. ఉంగుటూరు పంచాయతీ ఆఫీసు వద్ద సర్పంచి బండారు సింధు జాతీయ జెండాను ఎగురవేశారు. ఉప సర్పంచి పాతూరి జగదీష్, ఎంపీటీసీలు పెనుగొండ బాలకృష్ణ, సందక రాంబాబు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. వంతెన సెంటర్లో గాంధీ విగ్రహం వద్ద కొండ్రెడ్డి సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురు వేశారు. ఎ.గోకవరంలో సర్పంచి మిద్దే సత్యవతి, తిమ్మయ్యపాలెంలో సర్పంచి సింహాద్రి శ్రీదేవి జాతీయ జెండాను ఎగురవేశారు.



పెదవేగి: గ్రామ, మండలస్థాయి ఉద్యోగులను సత్కరిస్తున్న ఎంపీపీ, అధికారులు



భీమడోలు : అన్నేవారిగూడెంలో జాతీయ జెండా వద్ద ప్రజాప్రతినిధులు, పెద్దలు



పెదవేగి: రాయన్నపాలెం పాఠశాల్లో విద్యార్థులకు బహుమతులు ప్రదానం

వసతి గృహానికి ఫ్యాన్ల వితరణ



భీమడోలులో ఎంపీపీ కనమాల రామయ్య చేతుల మీదుగా వార్డెన్‌కు ఫ్యాన్లు అందిస్తున్న దృశ్యం

భీమడోలు: భీమడోలులోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యాభ్యాసం చేస్తున్న బాలికలకు అవసరమైన ఐదు సీలింగ్ ఫ్యాన్లు అందించి భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి, కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సింహాద్రి తమ దాతృత్వాన్ని చాటారు. ఇటీవల ఆ వసతి గృహంలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి రాత్రి బస చేసారు. బాలికలతో కలిసి ఆమె నిద్రపోయారు. ఈ సమయంలో ఫ్యాన్లు లేక బాలికలు పడుతున్న ఇబ్బందులు, మంచినీటి సమస్యలను గుర్తించారు. దీనితో ఆమె రెండు ఫ్యాన్లను అందించారు. ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సింహాద్రి తన స్నేహితులు సీనియర్ అసిస్టెంట్ బ్యాంకు మేనేజర్ రవికుమార్, నిడదవోలు బాబి కలిసి మూడు ఫ్యాన్లు అందించారు. ఈ ఫ్యాన్లును ఎంపీపీ కనుమాల రామయ్య చేతుల మీదుగా వార్డెన్లకు అందించారు. మంచినీటి సమస్య పరిష్కారానికి అవసరమైన కనెక్షన్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్‌లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం



వీరమ్మకుంటలో సర్పంచ్ ఉప ఎన్నిక ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, అభ్యర్థి చంటిబాబు

పెదపాడు: వైఎస్సార్ సీపీ బలపర్చిన సర్పంచి అభ్యర్థి మరడాని చంటిబాబును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు అన్నారు. మండలంలోని వీరమ్మకుంటలో సర్పంచి అభ్యర్థి మరడాన వెంకట లక్ష్మణ సోమేశ్వరరావు(చంటిబాబు)తో కలిసి ఆమె ప్రచారం నిర్వహిస్తున్నారు. కత్తెర గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి, ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, వైస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి, సంబంగి శ్రావణకుమార్ పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడి

భీమడోలు : ఆగడాలలంకలోని చెరువుగట్టు వద్ద మంగళవారం కోడి పందేలు నిర్వహిస్తున్న 14 మందిని భీమడోలు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామంలో కోడి పందేల శిబిరంపై ఆకస్మిక దాడిచేసారు. రెండుకోడిపుంజులు, రూ.10,700 స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశామని ఎస్సై చావా సురేష్‌కుమార్ తెలిపారు.

స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



పాతబస్టాండ్ సెంటర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): దేశ స్వాతంత్ర్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకుందామంటూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం ప్రతిజ్ఞ చేశారు. వివిధ సంఘాల నాయకులు మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మత ఘర్షణలు పెరిగిపోయి దేశ సమైక్యతకు సమగ్రతకు ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో ఘోరాలను ప్రపంచం అంతా చూసి నివ్వెరపోయిందన్నారు. దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలు లూటీ చేసే విధంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆరోపించారు. మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. నాయకులు యు.వెంకటేశ్వరరావు, బద్దా వెంకట్రావు (ఇఫ్టూ), ఆర్ లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్ (సీఐటీయూ), బండి వెంకటేశ్వరరావు (బీకేఎంయూ), కె.శ్రీనివాస్ (ఏపీ రైతు సంఘం), డీకే రంగనాథ్ (ఏఐకేకేఎస్), కె.కృష్ణమాచార్యులు (ఏఐటీయూసీ) మాట్లాడారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



సీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భూగోళాన్ని రక్షించడానికి పర్యావరణ పరిరక్షణ ఒక్కటే మార్గమని, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని సీఆర్‌ఆర్ మహిళా కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు పిలుపునిచ్చారు. మంగళవారం కళాశాల ఆవరణలో నామట్టి నాదేశం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. మొక్కలు నాటి, అవి పెరిగి పెద్దవి అయ్యేవరకూ సంరక్షించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.శైలజ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట యోధుల అడుగు జాడల్లో నడవాలని సూచించారు.

చేయూత సంస్థ ఆర్థిక సాయం

పెదవేగి : ఆపదలో ఉన్న వారికి చేయూత సస్వచ్ఛంద సంస్థ అండగా నిలుస్తోందని సంస్థ నిర్వాహకులు చెబుతున్నారు. మంగళవారం రాత్రి పెదవేగి మండల పరిధిలోని ముందూరు, కవ్వగుంట గ్రామాలకు చెందిన రెండు కుటుంబాలను చేయూత సంస్థ ఆర్థికంగా ఆదుకుంది. సంస్థ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ముందూరు గ్రామానికి చెందిన దొంతా దుర్గా మౌనికకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.30,000 ఆర్థిక సాయం, కవ్వగుంటకు చెందిన మేకా మంగరాజు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.25,000 నగదు, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులకు రూ.5,250 ఆర్థిక సాయం బాధిత కుటుంబాలకు అందించారు. ఈ కార్యక్రమంలో బొమ్మగాని బాలకృష్ణ, ఉమారగాని శ్రీను, బైగానిరంగారావు, బెజవాడ నరసింహారావు, పరసా మోహన్ పాల్గొన్నారు.